# ఆత్మతత్త్వమునుండియే అహంతత్త్వము ఉద్భవించింది

చిత్రంబులు త్రైలోక్య పవిత్రంబులు
భవలతాల విత్రంబులు సన్మింత్రబులు
మునిజన వన చైత్రంబులు
విష్ణుదేవు చారిత్రంబుల్.

దివ్యాత్మస్వరూపులైన ఆధ్యాపకులారా, ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

చాలా విచిత్రమైన చిత్తరువు, భగవంతుడు రచించిన యీ ప్రపంచము. దీనిని చూచి ఆశ్చర్య, ఆనందములతో అనుభవించవలసినదేగాని విజ్ఞాన దృష్టితో విమర్శించుటకుగానీ, విశదీకరించుటకుగానీ వీలుకాదు. దేహములేని చిత్రకారుడు, రంగులు లేని కుంచెతో ఆధారములేని గోడపైన అతి చిత్రముగా చిత్రించిన బొమ్మయే యీ జగత్తు. ఈ చిత్తరువును చూచుకొలది మాయామయంగా వుంటుంది. అగమ్యగోచరంగా వుంటుంది. ఉన్నదానిని లేనట్లుగా, లేనిది వున్నట్లుగా నిరూపిస్తుంది. ఏది నిజమో, ఏది అబద్ధమో గుర్తించుటకు వీలుకానిది యీ జగత్తు. సత్యమని కొందరు, అసత్యమని కొందరు, సదసత్తులతోకూడిన మిథ్యయని యింకాకొందరు యిలా అనేక తర్కవితర్కములతో విమర్శించుతూ వచ్చారు. ఈ తర్కాలకు, తార్కాణాలకు స్వస్తి చెప్పి మూలాధారమైన తత్త్వమును గుర్తించుటయే సరియైన విద్య.

### ఈ ప్రపంచమంతయు 'నేను' అనే తలంపుపై ఆధారపడియుంటున్నది

ప్రపంచమంతయు నేననే తలంపుపైనే ఆధారపడియుంటున్నది. ఈ నేను అనే తత్త్వము మనస్సునందు వుండినంతవరకు యీ ప్రపంచము మనకు గోచరిస్తుంది.

sri sathyasai vachanamrutam

ప్రపంచము వుండినంతవరకును దుఃఖమును దూరము చేయుటకు వీలుకాదు. నిద్రయందు 'నేను' అను తలంపు లేదు. ఎప్పుడు 'నేను' అనే తలంపు లేదో అప్పుడు ప్రపంచముకూడను మనకు గోచరించదు. ప్రపంచములేని స్థితిలో దుఃఖమనేది అదృశ్యము. యీ దుఃఖముయొక్క నివృత్తి నిమిత్తమే మానవుడు ఆనందమును కోరుచున్నాడు. ఆనందమంటే ఏమిటి? ఐశ్వర్యము, అధికారము, ఆరోగ్యము యివేనా ఆనందముయొక్క చిహ్నములు? ఈ జగత్తులో ఐశ్వర్యవంతులు యెంతమంది లేరు? వీరందరు ఆనందమును అనుభవించుచున్నారా? అధికార, ఆరోగ్యములతోకూడిన వ్యక్తులు యెంతమంది లేరు? వీరందరు ఆనందమును అనుభవించుచున్నారా? లేదు. కారణము? 'నేను' అనే తలంపు మానవునియందు వుండినంతవరకు ఆనందము అతి దూరము.

**పరిమితమైన మానవత్వము అపరిమితమైన 'నేను' తత్త్వముతో కూడినప్పుడు 'మనిషి' అనే పరిమితతత్త్వము ఉండదు**

ఎండమావులను చూచి మృగములు దాహము నిమిత్తమై వాటివెంట పరుగులెత్తి కడకు అది నీరుకాక, దాహము తీరక నిలువునా నిరాశతో కూలిపోవుచున్నవి. అదే విధముగనే మానవుడు విషయములయందు, వస్తువులయందు, ఆనందమును అనుభవింతునని ఆశించి కడకు అది నిత్యానందము కాక నిరాశతో కర్తవ్యాన్ని గుర్తించక కాయాన్ని వదలుతున్నాడు. 'నేను' అనే తలంపు యేనాడు మానవునినుండి వీడిపోవునో ఆనాడే తాను బ్రహ్మస్వరూపముకాగలడు. వేదాంతము 'బ్రహ్మసత్యం జగత్ మిథ్య' అని బోధించినది. ప్రపంచము సత్యమో, అసత్యమో అది మాయయో లేక మిథ్యయో; ఈ విషయమును ప్రపంచమునకే వదలిపెట్టు. దీనియొక్క నిత్యానిత్యములు ప్రపంచమే నిరూపించగలదు. మొదట నీవు సత్యమో, అసత్యమో గుర్తించటానికి ప్రయత్నించు. నీ సత్యమును నీవు గుర్తించినప్పుడే జగత్తు మిథ్యయని, నీవు సత్యమని నిర్ణయము చేసుకోగలవు. 'నేను బ్రహ్మ' అనే వాక్యము కలదు. అయితే బ్రహ్మ అనే పదమనకు ముందు 'నేను' అనే పదము వుంటుండాది. ఈ 'నేను' అనే పదము ఎక్కడిది? ఈ నేను అనే పదమునకు అర్థమేమిటి?

srisathyasaivachanamrutam

నేను అనటము కేవలము యిది ఒక భావము కాక, సహజము అయిపోతుంది. ఈ యొక్క సహజానికి ప్రక్కన మనిషి అనే భావము యేర్పడుతుంది. అనగా నేను మనిషిని అనే పదము, నేను సహజము అనే భావము. ఇక్కడ 'నేను' పరిపూర్ణత్వము. 'మనిషి' అనేది అపరిపూర్ణము. మనిషి అనేది ఒక హద్దుతోకూడినది. 'నేను' అనేది అనంతమైనది. కనుక, యీ హద్దుతోకూడిన 'మనిషి' పరిపూర్ణమైన 'నేనుతో' కూడినప్పుడు 'నేనే' అవుతుంది కాని, తిరిగి 'మనిషి' అనే పదము వుండదు. నది ఒక రూపనామముతో ప్రవహిస్తుంది. సముద్రములో లీనముకాక పూర్వము యిది ఒక హద్దుతో వుంటుంటాది. దీనికొక పరిమితి వుంటున్నది. కాని అనంతమైన సముద్రముతో కలసినప్పుడు దీనియొక్క పరిమితి, దీనియొక్క రూపము, దీనియొక్క నామము, దీనియొక్క రుచి కోల్పోతుంది. కనుక, నది సముద్రములో చేరినప్పుడు సముద్రమే అవుతుందిగాని నది అనేది వేరుగా వుండదు. అదే విధముగనే పరిమితముతోకూడిన మానవత్వము అపరిమితమైన 'నేను' అనే తత్త్వముతో కూడినప్పుడు 'నేనే' నిల్చిపోతుందిగాని యీ మనిషి అనే పరిమిత తత్త్వము వుండదు.

**ప్రతి మానవుడు మొట్టమొదటగా 'నేను' అనే తత్త్వమును గుర్తించుట అత్యవసరము**

'నేను' అనే పదమునకు పుట్టుక స్థానమెక్కడ? దీనినే సంస్కృతమునందు 'అహం' అన్నారు. 'అహం' అనే పదము ఆత్మనుండి పుట్టినది. ఈ 'నేను' అనే సంకల్పమే యీ యొక్క 'అహం'. ఈ 'నేను' అనే సంకల్పమునుండియే మనస్సు అనేది ఒక రూపము చెందివున్నది. ఏతావాతా యీ మనస్సు, యీ నేను, యీ అహము, అన్నీ ఆత్మయొక్క అంశములే! ఆత్మ తాత అనియు, అహం పుత్రుడనియు, యీ మనస్సనేది మనుమడనియు దీనియొక్క సంబంధమును పోలుస్తారు. ఇది ఒక వస్త్రము. ఈ వస్త్రమునకు దారములు ఆధారము. ఈ దారమునకు ప్రత్తి ఆధారము. ప్రత్తికి ఏ రూపము లేదు. నిర్మలత్వము, పవిత్రము మాత్రమే వుంటుంది. కనుక, యీ ప్రత్తినుండియే యీ దారము వుద్భవించినది. ఈ దారముయొక్క చేరిక చేతనే వస్త్రము యేర్పడినది. అదే విధముగా నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన ఆత్మతత్త్వమునుండియే 'అహం' అనే 'నేను' అనే తత్త్వము ఆవిర్భవించింది. ఈ 'అహం' తత్త్వమునుండియే మనస్సు ఏర్పడింది. కనుక, మన మనస్సు, కేవలము

srisathyasaivachanamrutam

ఆత్మభావములతోనే, ఆత్మగుణములతోనే నిండియుండాలి. అహమునకు, ఆత్మకు వుండిన భేదాన్ని మనము గుర్తించాలి. అహం పుట్టేది, పెరిగేది, వచ్చేది, పోయేది. కాని, ఆత్మకు పుట్టుట, పెరుగుట, నశించుట, వచ్చుట, పోవుట అనే పరిణామములు వుండవు. కనుకనే అపరిమితమైన ఆత్మతత్త్వమునుండి పరిమితమైన 'నేను' అనే అహంతత్త్వము, తద్వారా సంకల్పవికల్పాత్మకమైన మనస్సనే స్వరూపము యేర్పడుతూ వచ్చాయి. అన్నింటికి మూలాధారమైన తత్త్వమును మనము గుర్తించినప్పుడే సమస్తమును మనము గుర్తించిన వారమవుతాము. కనుక, ప్రతీ మానవుడుకూడను నేను నేను అనే తత్త్వమును ప్రప్రధమములో గుర్తించటము అత్యవసరము. అట్టి ఆధారమైన దానిని విసర్జించి, ఆధేయమైన ప్రకృతిని మాత్రమే ఆశ్రయించి తద్వారా మనము నిరాశకు గురి అగుచున్నాము.

## చైతన్యము సర్వత్ర వ్యాపించియుంటుంది

చైతన్యము సర్వత్రా వ్యాపించినదే! మనస్సునందుకూడను యీ చైతన్యము వున్నది. కాని, మనస్సుయొక్క చైతన్యము పరిమితితోకూడివుంటుంది. కనుక, యీ మనస్సుయొక్క పరిమితముచేతను, పరిణామముచేతను ప్రభావముచేతను భౌతికమైన జగత్తును విచారించటము, పరిశీలించటము, పరిశోధించటము జరుగుతూ వుంటుంటాది. ఇదంతా కేవలము ఒక విధమైన కళాచిత్రమే! (art). Art is outside, heart is inside. Art should come from the heart. ఆ సత్యమును మనము గుర్తించాలి. మనము యీనాడు బింబమును విడిచి ప్రతి ప్రతిబింబములకొరకు ప్రాకులాడడం చేతిలోని పిట్టను వదలి పొదలోని పిట్టకోసమై ప్రాకులాడునట్టుగా వుంటుండాది. ఈనాటి మన పరిశోధనలు అన్నీకూడను కేవలము అంతర్భావములయొక్క ప్రతిబింబములనే సత్యాన్ని గుర్తించాలి. మనము చక్కగా మనస్సును concentration చేస్తూపోతే దివ్యమైన మూలాధారము గుర్తించటానికి వీలవుతుంది. కనుకనే The essence of education is concentration of mind not collection of facts అన్నారు. అయితే యీనాడు collection లోపలనే మన జీవితమంతయుకూడను connection అయివుంటుండాది. Concentration అనేది

కనుమరుగైపోయి వుంటుండాది. దీనిని మనము గుర్తించాలి.

**ఈనాడు పక్షికి ఉన్న ఆత్మవిశ్వాసము మానవునకు లేదు**

జగత్తంతయుకూడను మనకు అనేక విధములైన ప్రబోధలు సలుపుతూ వస్తున్నాది. ఎవరికి వారే తమ జీవితముయొక్క రహస్యమును, చైతన్యమును గుర్తించుటకు ప్రయత్నించాలి. మన నిజస్వరూపాన్ని మనము విస్మరించి, ప్రతిబింబమును అనుసరించి అజ్ఞానముచేత మరింత అంధకారములో ప్రయాణము సలుపుతున్నాము. మొట్టమొదట, నీకు నీవు గురువుకావాలి. జగత్తును నీవు ఆచరణరూపమైన ప్రతిబింబముగా అనుసరించాలి. ఈ కారణముచేతనే Nature is a preacher; life is a teacher అన్నారు. మనము యీ విధమైన సత్యాన్ని గుర్తించినప్పుడే మన జీవితము సక్రమమైన మార్గములో నడిచి సరైన కాలములో మనము గమ్యమును చేరుకోగలము. ప్రతి వ్యక్తికూడను తనయొక్క దివ్యత్వాన్ని తాను అబివృద్ధిగావించుకొనుటకు పూనుకోవాలి. ఏదో మనము కొన్ని గ్రంథములను ఆశ్రయించి, కష్టపడి కంఠస్థము చేసి. వుత్తమస్థాయి లోపల వుత్తీర్ణుడు కావచ్చును. ఇంతమాత్రముచేతనే చదువు పూర్తి అయినదని భావించరాదు. గ్రంథపరిచయముచేతను, కంఠస్థముచేయడంచేతను నేర్చిన విద్యలు, విద్యలు కానేరవు. కనుకనే మనము Nature is preacher అనే సూక్తిని గుర్తుపెట్టుకోవాలి. ఏ విధముగా Nature preacher గా వుంటుండాది? అదే మనకు సహనముతో, సత్యముతో, స్వార్థరహితమైన భావముతో తాను అన్నింటిని సహించి, భరించి, లోకానికి తనయొక్క శాంతస్వభావాన్ని, సహజస్వరూపాన్ని, సత్యభావాన్ని ప్రకటిస్తూ వస్తున్నది. ఒక వృక్షము వుంది అనుకోండి. ఈ వృక్షము ఎండకు, వానకు భరించి సహిస్తుంది. ఎవరైనా దానిని బాధించినా, హింసించినాకూడను సహిస్తుంది. తనను హింసించిన వ్యక్తులే తన ఆశ్రయమును కోరినప్పుడు తన ఛాయను ఆశించినప్పుడు వారికి చల్లదనమును అందిస్తుంది. వారిని ద్వేషించదు. సహనముచేత తీయని ఫలములను వారికి అందిస్తుంది. ఈ వృక్షముయొక్క సహజమైన శాంతస్వభావమును మానవుడు మొట్టమొదట గుర్తించి తానుకూడను దానిద్వారా కొన్ని ఆదర్శములను నేర్చుకోవాలి. ఇంక పక్షులు చూడండి. ఈ

sri sathyasai vachanamrutam

పక్షులు నిరంతరము ఆనంద, ఆహ్లాదములతో ఆటలను ఆడుకుంటూ వుంటాయి. ఏదో ఏనాడో రాబోయే జీవిత నిమిత్తమై తాము యేవిధమైన ధనమును ఆర్జించి కూడబెట్టుకొనుటలేదు. జీవితము క్షణభంగురమనే సత్యమును పక్షులుకూడను గుర్తిస్తాయి. కనుక, ఎప్పటి జీవితాన్ని, ఎప్పటి ఆకలిని అప్పటికి మాత్రము అనుభవించి మున్ముందు యేమి గతియని యే మాత్రము విచారణ చేయవు. నా బిడ్డలు యే విధముగా అభివృద్ధికావాలని బ్యాంక్ బ్యాలన్సుకోసమనో యింకేవిధమైన అభివృద్ధి కోసమనో, ఏ యిండ్లో మేడలో కట్టి వాటి నిమిత్తమై అవి యేమాత్రము ప్రాకులాడవు. అవి తమ ఆత్మవిశ్వాసముపై తాము ఆధారపడివుంటున్నాయి. ఒక చిన్న ఉదాహరణము. ఒక లేత కొమ్మపైన చిన్న పక్షివాలుతుంది. అది కూర్చున్న తక్షణమే కొమ్మవూగుతుంది. ఈ కొమ్మ వూగినదే అనే భయము ఆ పక్షికి యేమాత్రము లేదు. కారణము, ఆ కొమ్మను తాను విశ్వసించలేదు, తన రెక్కలను తాను విశ్వసించింది. కనుకనే కొమ్మ వూగనీ, రాలనీ, కూలనీ తనకేమాత్రము భయము వుండదు. తన ఆత్మవిశ్వాసము, స్వశక్తిపైన తాను ఆధారపడటంచేత. కాని యీనాటి మానవుడు సంసారమనే చిన్న వృక్షముమీద కూర్చుని అది యిటూ అటూ యేకించిత్తు కదలి, అశాంతి సంభవించినప్పటికి తాను కుమిలి, కృశించిపోతున్నాడు. పక్షికున్న ఆత్మవిశ్వాసము యీనాటి మానవునకు లేకపోతున్నాది. కనుకనే పక్షియొక్క ఆదర్శమును, పక్షియొక్క అనుభూతిని మానవుడు చక్కగా గుర్తించి తానుకూడ ఆ విధమైన తెలివితేటలను కలిగి వుంటుండాలి. ఇదే విధముగనే ప్రతి పదార్థముయొక్క విచారణకూడను మనము చక్కగా చేసినప్పుడు యిందులోవుండిన అంతరార్థము అనుభూతితో అందించేదే. కనుక, Nature is preacher అన్నారు.

**ఆత్మవిద్యయే నిజమైన విద్య**

మానవునియందు ప్రాకృత సంబంధమైన భావములు చేరిపోవటంచేత తరతరములనుండికూడను వాని మనసు కరడుకట్టుకొని పోయిన అజ్ఞానముతో నిండిపోయింది. ఈ అజ్ఞానమును తొలగించవలెనన్న మంత్రాలతో, తంత్రాలతో, యజ్ఞాలతో, యాగాలతో, జప, ధ్యాన, భజనలతో యేమాత్రము సాధ్యముకాదు. నిజముగా

srisathyasaivachanamrutam

అంతరాత్మయొక్క తత్త్వమును, 'నేను' అనే తలంపుయొక్క తత్త్వమును యేనాడు మానవుడు గుర్తించునో ఆనాడు యివి యేమాత్రముకూడను మనిషిని బాధించవు, బోధించవు. ఒక పాత్రలో వుండిన తైలములోపల చంద్రుని ప్రతిబింబము కనిపిస్తుండాది. ఈ ప్రతిబింబమును తొలగించవలెనన్న అగ్నిలో పెట్టి చక్కగా కాల్చినప్పటికిని ఆ ప్రతిబింబము తొలగదు. ఈ ప్రతిబింబమునకు ఆధారము యేమిటి? తైలము. ఆధారమైన ఆ తైలము తొలగినప్పుడే ప్రతిబింబముకూడను తొలగుతుంది. అంతేకాని పాత్రను కాల్చినంతమాత్రమున ప్రతిబింబము దూరము కానేరదు. మన దేహమే ఒక పాత్ర. ఇందులో వుండిన విషయవాసనలు, మోహమనేదే యిందులో తైలము. ఇందులోనే మనస్సుయొక్క ప్రతిబింబము ప్రకాంతితో కనిపిస్తుండాది. దీనినే 'చంద్రమా మనసో జాతః ' అన్నారు. అనగా చంద్రునియొక్క ప్రతిబింబము మనస్సు. మనసుయొక్క ప్రతిబింబము చంద్రుడు. కేవలము దేహాన్ని శ్రమింపజేసి జపధ్యాన యోగాదులంతా జేసి, ఎన్నివిధములైన పరిశ్రమలు సలిపినప్పటికిని యిందులో వుండిన మనస్సుయొక్క మాలిన్యము తొలగదు.

**పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా?**
**తనువును తాదండించిన విషయభోగములడగునా?**
**ఆకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞాని తానగునా?**
**తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞానమెట్లు కుదురును?**

మొట్టమొదట నేనెవరు అనే సత్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. దానిని గుర్తించిన వ్యక్తే జగత్తునంతకూడను సులభముగా గుర్తించగలడు. భగవంతునకు ప్రకృతి భిన్నముగా వున్నదని భావించే వ్యక్తి మాత్రమే యీ ప్రకృతి మిథ్యము అని విశ్వసిస్తాడు. భగవంతుడే ప్రకృతి అనే సత్యాన్ని గుర్తించినవానికి ప్రకృతికూడను సత్యమే! కనుక, మనము దృష్టిలోపాన్ని పోగొట్టుకోవాలి. సృష్టిలో దోషాన్ని మనము వెతకరాదు. సృష్టిఅంతయుకూడను భగవత్మయమే! ఇట్టి సత్యాన్ని మనము యీనాడు విద్యద్వారా గుర్తించడానికి ప్రయత్నించాలి. ఆత్మవిద్యయే, నిజమైన విద్య. భౌతికవిద్యలు ప్రాకృతమైన జీవితానికి అవసరమే! అయితే, యివి మిథ్యాస్వరూపమైనవి. అపరిపూర్ణమైనవి. ఈ

sri sathyasaivachanamrutam

అపరిపూర్ణమైన విద్యద్వారా పరిపూర్ణుడైన భగవంతుని మనము గుర్తించటానికి ప్రయత్నించాలి.

**రామాయణమును శ్రవణముచేసి, యితరులకు వినిపించినంత మాత్రాన సరిపోదు, తానే రామునిగా మారిపోవాలి**

ఈనాటి మానవునియొక్క దృష్టి అంతయు కేవలము బాహ్యజగత్తుపైనే ప్రసరిస్తూ వుంటుండాది. ప్రకృతిని పరిశీలించే శక్తి, సామర్థ్యములు యీ విద్యయందు వున్నవిగాని పరమాత్ముని పరిశీలించే శక్తి సామర్థ్యములు యీ విద్యలో యే మాత్రముకూడను లేవు. ఎంతకాలమైనప్పటికిని యీ ప్రకృతినే మనము పరిశోధిస్తూ పోయినప్పుడు మనకు తేలేది పంచభూతములే! ఈ పంచభూతములను ప్రధానంగా, ప్రమాణంగా, ఆధారంగా తీసుకొని మనము ప్రకృతిని అనుభవించటానికి వీలవుతుంది. ఇదికూడను ఒక పరిమితముతోకూడినది. ఏనాటికైనాకూడను, యివన్నియూ పరిమితములేకాని అపరిమితములుకావు. కనుకనే, 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి', బ్రహ్మతత్వాన్ని గుర్తించినవాడే బ్రహ్మ కాగలడని వేదాంతము. చరిత్రలు చదివేవాడు కేవలము చరిత్రను గుర్తించటముకాదు, తానే చారిత్రకుడుకావాలి. రామాయణమును శ్రవణముచేసి విని యితరులకు వినిపించినంతమాత్రమున చాలదు. తాను రామునిగా మారిపోవాలి. ఇట్టి మూలాధారమైన సూత్రాన్ని మనము గుర్తించినప్పుడే మనయొక్క చదువుకూడను సార్థకము కాగలదు.

**భౌతిక విద్యలతోబాటు ఆధ్యాత్మిక విద్యను అభ్యసించాలి**

'విద్యయొసగు వినయము, వినయమున కలుగు పాత్రత'. పూర్వము ఒకరిని ఒకరు మిత్రులు కలుసుకున్నప్పుడు యెంతో ఆప్యాయముగా ఒకరినొకరు ప్రశ్నించుకుంటూ వుండేవారు. ఈ సాంప్రదాయమును అనుసరించి ఆంగ్ల భాషలోకూడను ఒకరినొకరు కలుసుకున్నప్పుడు GOD BOY అని ఒకరినొకరు పలకరించుకొంటూవుండేవారు. ఇది ప్రాచీన సంస్కృతియొక్క ప్రధానమైన లక్షణము. క్రమక్రమేణా యీ ఆధునిక విద్యలు పెరుగుతూ పెరుగుతూ GOD BOY పోయింది, GOOD BOY అయింది. పోనీ,

sri sathyasai vachanamrutam

కొంతవరకు మంచిగానే GOOD BOY అన్నారు. క్రమక్రమేణా యీ ఆధునికి విద్య ఇంకా పెరిగిపోవటంచేత GOOD BYE అన్నారు. ఇంకా పెరుగుతూ పెరుగుతూ పోయేటప్పటికి GOOD పోయింది, BYE-BYE అన్నారు. ఈ విద్యయొక్క ప్రభావము ఎంత అసహ్యముగా తయారైందో, ఎంతవరకు దిగజారిపోయిందో మీరే యోచన చేసుకొండి. ఒకరికొకరు చూచినప్పుడు 'హరిఓం' లేక 'ఓం' లేక 'సాయిరాం' అని పలుకరించి భగవత్ వాక్యముచేత ఒకరినొకరు నమస్కరించటము ప్రాచీన సాంప్రదాయము మరియు సంస్కారము. 'నమస్తే' లేక 'నమస్కారము' అని చెప్పేవారు. ఈనాడు ఆధునిక విద్యలు అభ్యసించటముచేత మిత్రులు ఒకరు యింకొకరిని చూచినంతనే సిగరట్టు చూపి 'హలో take it' అంటూ సిగరట్టుతో వారు నమస్కారము చేస్తున్నారు. లేక ఒక బ్రాంది బాటిల్ అందించటమో జరిగిపోతుండాది. ఇంకా ఆధునికముగా జరుగుతూ ఒక card pack చూపించి. 'come on come on' అని cards ఆడటం చేస్తున్నారు. విద్యయొక్క విలువ యీ విధముగా దినదినానికికూడను దిగజారిపోతుండాది. కనుకనే విద్యలవల్ల వుపయోగమనేది మనకు కనిపించటములేదు. అంతేకాదు ఈ విద్యలు కేవలము పూర్తి పొట్టకూటికికూడను పనికివచ్చేవిగా ఉండటంలేదు. న్యూస్ పేపర్లో చూద్దామా అంటే చదువుకున్న విద్యార్థులకందరికికూడను ఎంప్లాయిమెంటు కల్పించాలనే ఉద్దేశ్యంతో అనేక రకాల ఎడ్వర్టైజు చేస్తుంటారు. వాళ్లు ఆ ఉద్యోగాలకు apply, apply, apply కాని no reply. యీ apply లు చేసి చేసి వారివద్దవున్న డబ్బుఅంతా apply లకే ఖర్చుయిపోతుండాది. అయితే, ఏవిధముగాను apply చేయకుండానే reply యిచ్చి job ను కూడా అందించేదే దివ్యమైన ఆత్మతత్త్వము. కనుక, మొట్టమొదట విద్యార్థులు భౌతిక విద్యలతో బాటు ఆధ్యాత్మిక విద్యను ప్రధానమైన ఆధారముగా విశ్వసించాలి. ఈనాటి విద్యావిధానములో విద్యార్థులు అనేక విధములుగా 1st rank, 1st class రావాలని చాలా ప్రయత్నము చేస్తున్నారు. అది అవసరమే! కాదనటము లేదు. కానీ, యే విధముగా నీవు 1st class తెస్తున్నావు? 1st class, 1st rank ఏ విధముగా వస్తుండాది? నిత్య జీవితములో నీ అనుభూతులు, నీ ప్రవర్తనలలోకూడను 1st rank రావాలి. ఈనాటి ర్యాంకులంతాకూడను కేవలము ఒక విధమైన మెకానికల్‌పద్ధతిలో జరిగిపోతుండాయి. ఇవి సహజమైన రీతిలో మేధాశక్తికి

sri sathyasaivachanamrutam

గుర్తింపుగా రావడం లేదు. ఇలాంటివి విద్యార్థులకు సరియైనవికాదు. విద్యార్థులు రాత్రి పదిగంటల తరువాత చదవటానికి పూనుకోకూడదు. కారణమేమనగా పగలంతయూకూడను శ్రమించి పనిచేసిన యీ దేహానికి రాత్రి విశ్రాంతి అవసరము. కేవలము కష్టపడి ర్యాంకు తెచ్చుకోవాలని శ్రమపడి, రాత్రినిద్రకుకూడను భంగము గావించుకొని చదవటము ప్రారంభిస్తూవుంటారు. తద్వారా చదువుసరిగా కొనసాగకపోవచ్చు, అనారోగ్యములు యేర్పడవచ్చు. క్రమక్రమేణా కృత్రిమమైన విద్యుద్దీపపు వెలుగులో చదవటంచేత కన్నులయందున్న రెటీనా దెబ్బతినవచ్చు. సహజమైన వెలుతురులో మనము చదవటానికి ప్రయత్నించాలి. కొంతమంది రాత్రిపూట చదవటము అభ్యాసము చేసుకుంటారు. దానివలననే జ్ఞాపకశక్తి పెరుగుతుందని భావిస్తుంటారు. ఇది కేవలము ఒక అపోహతో, అభ్యాసముతో యేర్పడిన imagination; భ్రాంతులు. ఇంకా కొంతమంది ఏదోఒకటి పొగపీలుస్తేనేగాని తెల్లవారి బయటకుపోటానికి వీలుకాదు అంటుంటారు. ఇవికూడను ఒక విధమైన దురభ్యాసములవల్ల ఏర్పడిన భావములేగాని సహజమైనవి కానేరవు. ఇదంతా కేవలము మెకానికల్‌గా జరిగిపోతూ వుంటుండాది. ఇది సరైనదికాదు. తమ సంభాషణలో, ఉపన్యాసములలో చాలామంది but, but, you see, you see, so, so, so you see, you see యిలాంటి పద ప్రయోగములు కేవలము యాంత్రికంగా వుపయోగపెట్టుతుంటారు. ఇవన్నీకూడను ఒక విధమైన అభ్యాసముతో యేర్పడిన దురభ్యాసములే! you see, you see ఏమిటి? you see ఎక్కడుంది? దీనియొక్క అర్థమేమిటి? ఇంకా కొంతమందికి కొన్ని విధములైన అభ్యాసములు వుంటుంటాయి. ఉదాహరణకు, మాట్లాడే సమయములో బుజాలు ఎగరవేయటం మొదలైనవి. ఇదికూడను ఒక విధమైన దురభ్యాసము. విద్యార్థులలో యీ విధమైన వికారములు బయలుదేరకూడదు. చాలామంది విద్యార్థులు, నేను చూస్తున్నాను, మాట్లాడుతూ మాట్లాడుతూ కాళ్లు వూపుతుంటారు. ఇది చాలా తప్పు. మరి కొంతమంది వూరికే కాళ్లు ఆడించటము చేస్తుంటారు. యీ విధముగా అనేక విధములైన దురభ్యాసములలో మునిగి ఉంటారు. ఇవన్నీ మెకానికల్‌గా జరిగిపోతూవుంటాయి. విద్యాభ్యాసము మెకానికల్‌గా జరిగిపోతుంటే యేమాత్రము ఉపయోగము వుండదు,

sri sathyasai vachanamrutam

ప్రపంచమునకు. అది హృదయమునుండి రావాలి, అనుభూతిలో అందించాలి, ఆచరణలో పెట్టాలి. ఈ ఆచరణలో వుండిన విద్యయే నిజమైన విద్య.

**హృదయములోపల విశ్వాసమనే జ్యోతిని వెలిగించుకున్నప్పుడు జగత్తంతా ప్రకాశముగా కనిపిస్తుంది**

కనుక, ఆత్మతత్త్వానికి, 'నేను' అనే భావమునకు వుండిన సంబంధాన్ని మొట్టమొదట విద్యార్థులు గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ 'నేను' అనేది వుండినంతవరకుకూడను ప్రపంచము దుఃఖము. ఒక చిన్న ఉదాహరణము. నిద్రలోపల మనకు 'నేను' అనే తలంపు లేదు. ఈ 'నేను' అనే తలంపు యెప్పుడు లేదో, అప్పుడు ప్రపంచముకూడను మనకు కానరాదు. ప్రపంచము ఎప్పుడు లేదో అప్పుడు దుఃఖముకూడను లేదు. తిరిగి నిద్రనుంచి లేవగానే యీ 'నేను' అనే తలంపు ప్రారంభమవుతుంది. దానితోబాటే ప్రకృతి అంతయుకూడను మనకు గోచరమవుతున్నాది. ఏతావాతా దుఃఖమును దూరము చేసుకొని ఆనందాన్ని పొంది ఆత్మతత్త్వాన్ని అనుభవించే విద్యయే నిజమైన విద్య. అదే self realisation. ఈ self realisation కు మొట్టమొదట ఆత్మవిశ్వాసాన్ని అబివృద్ధి పరచుకోవాలి. అదే self confidence. అదే నీకు ఆనందాన్ని యిస్తుండాది. Self confidence ఎప్పుడు అభివృద్ధి పరుచుకున్నామో అప్పుడు self satisfaction తృప్తి యిస్తుండాది. యీ confidence వుండినంతవరకుకూడను నీకు ఏ మాత్రము అసంతృప్తి వుండదు. నీలో ఏదో ఒక అసంతృప్తి వుంటున్నాదంటే నీలో confidence సరిగా లేదన్నమాటే! కనుకనే మొట్టమొదట మన హృదయములోపల సరైన confidence develop చేస్తే nation అంతాకూడను సరైన ప్రకాశముతో జీవిస్తుంది. Light a lamp in each house and the whole street will be lighted. నీ హృదయములోపల విశ్వాసమనే లైటును నీవు అంటించుకుంటివా యీ జగత్తంతాకూడను ప్రకాశంగానే కనిపిస్తుంది. కనుక, మీలో వుండిన యీ దివ్యమైన జ్యోతిని మీరు మొట్టమొదట వెలిగించుకొనుటకు ప్రయత్నించండి. ఇలాంటి సత్యమైన, నిత్యమైన, ఆదర్శమైన, ఆధారమైన విషయాన్ని విస్మరించి యేదో మార్కులు, రిమార్కులు రావటంకోసమని

sri sathyasai vahinamrutam

చదువులు చదివితే దీనివల్ల ఒరిగేది యేమీలేదు. ఎంతమంది విద్యావంతులు లేరు? ఎంతమంది గొప్ప గొప్ప scholars లేరు, యీ జగత్తులో! వీరంతా తమ ఆనందాన్ని కోల్పోయి, అశాంతిలో మునిగి, నిస్పృహతో, నిరాశతో జీవితాన్ని గడుపుతున్నారు. హిట్లర్ జగత్తునంతా అదిరించాడు. తాను గొప్ప మేధావి ననుకున్నాడు. కాని, అతనియొక్క అహంకారమే అతని ప్రాణాన్ని తీసింది. 'యద్భావం తద్భవతి'. తాను చేసిన దుష్కర్మల ఫలితాన్ని తాను అనుభవించక తప్పలేదు. న్యూటన్ భూమియొక్క ఆకర్షణశక్తిని కనిపెట్టాడు. ఎంతయో శక్తిమంతుడు, మేధావి. కాని అతని జీవితములో ఆనందమనేది అనుభవించలేదు. న్యూటన్ అనేక విధములుగా పరిశోధనలు చేసి కట్టకడపటికి పిచ్చితోనే మరణించాడు. మతిభ్రమణ జరిగింది. యీ అనిత్యమైన వాటిలోపల మన జీవితాన్ని వ్యర్థము చేసికొని తెలివితేటలను వుపయోగపెట్టి, మన సహజ జీవితాన్ని మనము కోల్పోరాదు.

**ఆధ్యాత్మిక విషయములందు seriousness కావాలి**

యీ జగత్తులోపల నిత్యం మనం యేదో ఒక విధమైన tension కు గురవుతుంటాము. అది మంచి విషయము కావచ్చు, చెడ్డ విషయము కావచ్చు. సంతోషకరమైనది కావచ్చు, విచారకరమైనది కావచ్చు. నవ్వుతుంటాము, ఏడుస్తుంటాము. ఈ tension యేదో ఒక విధంగా బయటపడిపోవాలి. అది ఖర్చై పోవాలి. ఆ ఖర్చయ్యే నిమిత్తమై కొన్ని విషయాలకు ఏడుస్తాము; కొన్ని విషయాలకు నవ్వుతాము. ఇదంతా tension యొక్క reaction లే. ఒక చిన్న ఉదాహరణము. పోయిన వారము కస్తూరి మిమ్మల్ని నవ్వించి వుండవచ్చు. ఆయన హాస్యములో దిట్ట. అయితే, అన్నింటియందుకూడను హాస్యము సరికాదు. ఆధ్యాత్మిక విషయాలు, పవిత్రమైన విషయములు మాట్లాడేటప్పుడు చాలా serious గా మాట్లాడాలి. వీటి మధ్యలో హాస్యమేగాని వచ్చిందంటే ఆ పవిత్రత అంతాకూడను పాడైపోతుంది. కనుక, సమయసందర్భాలు చూచుకొని యీ హాస్యమును, వుపయోగపెడుతూరావాలి. ఒకడు దారిన నడుస్తూ వుంటాడనుకోండి; ఆ సమయములో యేదో ఒక అరటితోలుమీద కాలువేసి జారి క్రింద పడిపోవచ్చు. ఆ జారిపడినప్పుడు అతడే కాకుండా చుట్టూ



srisathyasaivachanamrutam

వున్నవాళ్లుకూడా నవ్వుతారు. అక్కడ ఏదైనా దెబ్బగాని తగిలెనా తాను ఏడుస్తాడు, చుట్టూ వున్న వాళ్లుకూడను చాలా serious గా వచ్చి అతనికి help చేస్తారు. అనగా అది సమయ, సందర్భానుసారముగా ఏర్పడిన tension యొక్క reaction.

**తన తత్త్వమును తాను గురించుటయే నిజమైన ఆధ్యాత్మికము**

ప్రతి మానవునియందుకూడను యేవో కొన్ని నిరాశలో, ఆశలో వస్తుంటాయి. వాటియొక్క reaction లు విచారంగా రూపొందుతాయి. ఇవి సంకల్పవికల్పములయొక్క పరిణామములే! పోయిన సంక్రాంతి దినము నేను చెప్పాను. యీ సంకల్పములను గురించి, మనస్సును గురించి, మొట్టమొదట ప్రతివ్యక్తికూడను గుర్తించుటకు ప్రయత్నించాలి. అప్పుడే యీ మానవత్వమనేది చక్కగా అర్థమవుతుందని చెప్పి ప్రతి గురువారము యీ మనస్సును గురించి తప్పక నేను ప్రబోధిస్తానని చెప్పాను. ఆ అవకాశము యీనాడు ప్రారంభము అయింది. ఇంక ముమ్ముందు ప్రతి గురువారముకూడను యి సంకల్పవికల్పముల, యీ మనస్సుయొక్క ప్రభావాన్ని గురించి వివరిస్తాను. దీనిని మీరు తెలుసుకోటం అత్యవసరము. ఈ మనసుయొక్క ప్రభావములు, reactions అనేకము వుంటున్నాయి. ఒకటికాదు రెండుకాదు, లెక్కకు మించిన స్వరూపాలు ధరిస్తుంది, యీ మనస్సు. యీ విద్యావిధానములోపల ప్రాకృతమైనదానిని, దీనికి ఆధారమైన దివ్యత్వాన్ని విచారణ సలుపుతూ ఈ రెండింటియందుకూడను ఉత్తీర్ణులు కావటానికి, దానియందు ఉత్తేజము అభివృద్ధి పరచుకోటానికి విద్యార్థులు తగిన కృషి చెయ్యాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. మనిషి తనకు తాను యెంత దూరమో భగవంతునికికూడను అంతదూరముగా వుంటాడు. 'నేను' అనే భావము యే స్థాయి యందుంచుకున్నాడో, ఆ స్థాయికి తగినట్టుగానే భగవంతుడుంటాడు. ఈ 'నేను' అనేది చెప్పేది ఎవరు? దేహమా? కాదుకాదు. దేహము జడము. కనుక, యీ జడమైన దేహము 'నేను' అని పలకటానికి వీలులేదు. ఇంక ఆత్మ 'నేన'ని చెప్పుతుందా అంటే ఆత్మ యేకత్వాన్ని ధరించినది కనుక రెండవ పదార్థమనేదేలేదు. కనుక ఆత్మకూడా చెప్పటంలేదు. కనుక, 'నేను' అనేది యీ దేహానికి, ఆత్మకు మధ్యలో చేరి రెండింటిని దగ్గరకు చేర్చి అంతర్థానమై

srisathyasaivachanamrutam

పోతుండాది. యిట్టి చేరికను ప్రతి మానవుడుకూడను నాస్తికుడు, యాస్తికుడు, ఆస్తికుడు, ఆస్తికనాస్తికుడు సర్వులుకూడను తెలుసుకోవలసిన విషయము. తనయొక్క వునికిని తాను లేదని చెప్పేవాడు ఒక్కడుకూడను లేదు, జగత్తులో. తన తత్త్వమును తాను గుర్తించటమే నిజమైన ఆధ్యాత్మికమని మనము గుర్తించాలి.

**(తేదీ 3-07-1986న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam